క్లుప్తంగా

నిరుపేద కుటుంబానికి దాతల సాయం



సాయం అందజేస్తున్న యువకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గుంట్లపేట్ గ్రామానికి చెందిన గిరుగుల రజిత గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మహారాష్ట్రలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో మండలానికి చెందిన యువకులు ఆమె చికిత్సకు చేయూత అందించారు. దాతల సహకారంతో సేకరించిన రూ. 27వేల నగదును ఎస్సై కొమురయ్య చేతుల మీదుగా సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. సోమన్న, మ హేశ్, ప్రసాద్, తిరుపతి, శేఖర్, చిన్నా పాల్గొన్నారు.

'నేటి బంద్ విజయవంతం చేయాలి'

కెరమెరి: ఆదివాసీ హక్కులను, చట్టాల రక్షణ కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న ఏజెన్సీ బంద్‌ను కెరమెరిలో విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా కన్వీనర్ కోవ విజయ్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని వ్యాపార సంస్థలు మూసివేసి సహకరించాలన్నారు.

సంఘం బలోపేతానికి ముందుకు రావాలి



జెండా ఆవిష్కరిస్తున్న అరిగెల నాగేశ్వరరావు

బెజ్జూర్: యాదవ సంఘం బలోపేతానికి యువకులు కలిసికట్టుగా ముందుకు రావాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో యాదవ్ సంఘం భవన నిర్మాణం కోసం రూ.5లక్షల నిధులు మంజూరు చేయిస్తానన్నారు. యాదవ సంఘం తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్ యాదవ్, సురేశ్ యాదవ్, గట్టయ్య యాదవ్, ఎర్రయ్య యాదవ్, శంకర్ యాదవ్, శ్రీశైలం, శ్రీను యాదవ్, కిషన్ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్, మాజీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, షణ్ముఖ, శేఖర్ తదితరులు ఉన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్

కాగజ్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నం.143లో సుమారు 999 చదరపు గజాల అనాథ పేదలకు నైట్ షెల్టర్ కోసం కేటాయించిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు సోమవారం మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ వినతిపత్రం అందించారు. ఈ స్థలంలో పునరావాస కేంద్రం నిర్మాణానికి మున్సిపాలిటీ రూ.50 లక్షలు మంజూరు చేసిందని, టెండర్లు కూడా పిలిచారని తెలిపారు. టెండర్ ప్రక్రియలో ఆలస్యం కావడాన్ని అనుకూలంగా మలుచుకుని కొందరు రాజకీయ పలుకుబడితో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటినంబర్ తీసుకున్నారని ఆరోపించారు. అలాగే పట్టణంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు.

గూడెంలో ముగిసిన పవిత్రోత్సవాలు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరిరోజు మహాపూర్ణాహుతి, పవిత్ర అవరోహణము, స్నపన తిరుమంజనము, కుంభ ప్రోక్షణ, హారతి, మంత్ర పుష్పం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వేదపండితులు భరత్‌శర్మ, ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కెరమెరి: కేజీబీవీలో నృత్యం చేస్తున్న చిన్నారులు



కౌటాలలో గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



ఆసిఫాబాద్‌అర్బన్: వేషధారణలో చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



కౌటాల: గోపిక వేషధారణలో చిన్నారి



కోలాటం ఆడుతున్న చిన్నారులు

వాంకిడి: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో భజన, కీర్తనలు నిర్వహించారు. చిన్నారులను కృష్ణుడు, రాధా వేషధారణలో తయారు చేసి సంబరాలు జరుపుకున్నారు. మండలంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో శ్రీ కృష్ణజన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. కౌటాల శివాలయం, సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కృష్ణుడు, గోపికల వేషధారణలు వేశారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, మండలాధ్యక్షుడు గట్టయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు వానుపటేల్, అర్చకులు శంకరయ్య, సంతోష్, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని కాలనీలతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం సిర్పూర్(టి) మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని గొల్లవాడలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వేంపల్లి, చీలపెల్లి, భూపాలపట్నం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై కమలాకర్, యాదవ సంఘం తాలుకా అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు రాజు, యాదవ సంఘం నాయకులు బాలకృష్ణ, మహేశ్, ప్రశాంత్, అశోక్, చంద మహేశ్, రమేశ్, సత్యనారాయణ, నగేశ్, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

కెరమెరి: గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం గోకులాష్టమి అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పటేల్ సోనేరావు ఇంటి నుంచి దీపంతో పాటు ఉట్టిని శివాలయానికి భజనలు చేస్తూ తీసుకొచ్చారు. ఆలయంలోనే రాత్రంతా భజనలు చేశారు. మోడీ కేజీబీవీలో వేసిన గోపికలు, శ్రీకృష్ణుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. పాటలు, గేయాలు, నృత్యాలతో వారు ఆకట్టుకున్నారు. మండలంలోని గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: కృష్ణాష్టమి వేడుకలను పట్టణంతో పాటు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ద్వారకానగర్‌లో గల శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. కొలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా సోమవారం శ్రీకృష్ణాష్టమిని మండలంలో బూర్గుడ ఆలయం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుని, గోపికల వేషధారణతో అలంకరించి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆసిఫాబాద్‌అర్బన్: కృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం ఆవరణలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పోటీలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు వేణుగోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వాంకిడి: రాధాకృష్ణుల వేషధారణలో పిల్లలు



కెరమెరి: వేషధారణలో విద్యార్థినులు



సిర్పూర్(టి): యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు



ఆసిఫాబాద్‌రూరల్: బూర్గుడ ఆలయంలో వేషధారణలో చిన్నారులు



కౌటాల: యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

ఏటీఎం సెంటర్లు లేక అవస్థలు

- ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి నష్టపోతున్న వైనం
- మండలంలో పది వేలమందికి పైగా ఖాతాదారులు



డబ్బుల కోసం బ్యాంకు వద్ద వేచి చూస్తున్న ఖాతాదారులు

తిర్యాణి: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. తాజాగా ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కానీ నగదును విత్‌డ్రా చేసేందుకు ఒక్క ఏటీఎం సెంటర్ కూడా లేకపోవడంతో రైతులతో పాటు సామాన్య జనం సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో బ్యాంకు ఎదుట రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా కేవలం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉంది. ఇందులో దాదాపు పది వేలకు పైగా ఖాతాలున్నాయి. మండల వ్యాప్తంగా ఒకే బ్యాంకు ఉండటం, ఏటీఎం సెంటర్ లేకపోవడంతో ఖాతాదారులకు నగదు కష్టాలు తప్పడం లేదు.

పదుల సంఖ్యలో మైక్రో ఏటీఎంలు..

మండల కేంద్రంలో బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలు లేవు. దాదాపు 30 కిలోమీటర్ల పరిధిలో కూడా ఏటీఎం సెంటర్లు లేవు. దీంతో ఖాతాదారుల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు పదుల సంఖ్యలో మినీ ఏటీఎంలు ప్రారంభించారు. ఖాతాదారుల వేలి ముద్రల ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి అందజేస్తున్నారు. ఇందుకోసం కోసం కమిషన్ తీసుకుంటున్నారు. కాగా వారు మండలంలో అత్యధికంగా ఉన్న నిరాక్షరాస్యులైన గిరిజనులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఖాతాదారులకు తెలియకుండా నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకుంటున్నారని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వివిధ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎం సెంటర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


ఏటీఎం ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఉన్న ఏకైక బ్యాంకు వద్ద కూడా ఏటీఎం సెంటర్ లేకపోవడంతో అత్యవసరమైన సమయంలో, బ్యాంకు మూసిఉన్న సమయంలో నగదు విత్‌డ్రాకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మండలంలో ఏటీఎం సెంటర్‌తో పాటు మరో బ్యాంకును ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

\- కోట్నాక గణపతి, కౌటగాం

జలపాతం.. ఆహ్లాదం





కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి అటవీ ప్రాంతంలో గల జలపాతం చూపరులకు కనువిందు చేస్తోంది. ఎటుచూసినా పచ్చటి చెట్లు.. కొండ మధ్యలో నుంచి పాల బుడగల్లాంటి జాలువారుతున్న నీటితో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ప్రకృతి అందాలను చూసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి సేదతీరుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే కోసిని మీదుగా ఊట్‌పల్లి వరకు వాహనాల ద్వారా వెళ్లొచ్చు. అక్కడి నుంచి జలపాతం వద్దకు చేరుకోవాలంటే కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. కాగా టైగర్‌జోన్ కావడంతో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఆలయాల్లో ఎక్కాహం



ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో 24 గంటల పాటు ఎక్కాహం (నిరంతర భజన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస్‌శర్మ, శేఖర్‌శర్మ, పూర్ణచందర్‌శర్మల ఆధ్వర్యంలో వినాయకుడికి అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, మంత్రపుష్పాన్ని నిర్వహించి ఎక్కాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు ఉదయం ఎక్కాహం ముగింపు కార్యక్రమం సందర్భంగా ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎక్కాహం

దహెగాం: మండల కేంద్రంతో పాటు లగ్గాం గ్రామాల్లో సోమవారం ఎక్కాహం నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయం, లగ్గాం కేశవనాథ ఆలయంలో ఎక్కాహం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు భజన చేస్తామని పేర్కొన్నారు.

మోతుగూడ ఆలయంలో..

ఆసిఫాబాద్‌రూరల్: శ్రావణమాసం సందర్భంగా సోమవారం మండలంలోని మోతుగూడ ప్రసన్న భక్తాంజనేయ ఆలయంలో ఎక్కాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ గ్రామంలో పాడి పంటలు పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని 24 గంటల పాటు భక్తిశ్రద్ధలతో ఏకధాటిగా భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు రాజయ్య, వినోద్, పెంటు, దాము, ప్రభాకర్ పాల్గొన్నారు.

కెరమెరి: గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. శివాలయంలో రాత్రంతా భజనలు చేశారు.



కెరమెరి: భజన చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్‌రూరల్: భజన చేస్తున్న భక్తులు

వారసంతలో పొలాల సందడి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వారసంతలో పొలాల పండుగ సందడి నెలకొంది. పొలాల అమావాస్య సమీపిస్తుండడంతో వ్యాపార దుకాణాల్లో ఎడ్లకు సంబంధించిన రంగులు, అలంకరణ సామగ్రిని రైతులు కొనుగోలు చేశారు. దీంతో వారసంతలో సందడి వాతావరణం నెలకొంది.

పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: సెప్టెంబర్ 1న నిర్వహించే పొలాల పండుగ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఉట్నూర్ ఐబీ నుంచి నేతకాని మహార్ కులస్తుల సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేలా గంగన్నపేట వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగేశ్, బొర్లకుంట దుర్గయ్య, కేవశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నుమియతండాలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.